సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శనివారం, 06.06.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 215
పేజీలు: 06 వెల: రూ. 5

# వైసీపీ నేత బొల్లా అరెస్ట్..

## గండిపేట భూ కబ్జా కేసులో అదుపులోకి

- కాంచీపురం నుంచి హైదరాబాద్‌కు తరలింపు!
- నకిలీ పత్రాలతో 10 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్ను..
- రూ.12 కోట్ల భూ కుంభకోణం దర్యాప్తులో కీలక మలుపు..
- ముందస్తు బెయిల్ నిరాకరణ తర్వాత పరారీలోకి..
- చివరకు కాంచీపురంలో చిక్కిన బొల్లా!

02



## పాలమూరు ప్రాజెక్టుల్లో

# వేల కోట్ల దోపిడీ!

## ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టుల సందర్శనలో సీఎం రేవంత్ రెడ్డి

- పాలమూరు-రంగారెడ్డి పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం
- రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదు
- కమీషన్ల పేరిట వేల కోట్లు కొల్లగొట్టారు..
- రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ రాజకీయాల్లో మరోసారి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరాకు కూడా నీరు అందించలేదని ఆయన ఆరోపించారు.

కరివెన రిజర్వాయర్ వద్ద మీడియాతో మాట్లాడిన సీఎం, బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల పేరుతో భారీ అవినీతి జరిగిందని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, రూ.27 వేల కోట్ల వరకు ఖర్చు చేసినా రైతులకు ప్రయోజనం చేకూరలేదని విమర్శించారు. ఈ పనుల ద్వారా కమీషన్ల రూపంలో వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపిస్తూ, "ఈ పనులతో కేసీఆర్ ఇంట్లో కనకవర్షం కురిసింది" అని వ్యాఖ్యానించారు. మిగతా 02లో



## తమిళనాట సరికొత్త రాజకీయం

### అన్నామలై రాజీనామాకు కమలం పార్టీ ఆమోదం



- వ్యక్తిగత పూజ వ్యతిరేకమన్న నేత
- వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటన

02

## పాలన చేత కాకపోతే తప్పుకోవాలి



### సీఎం రేవంత్ రెడ్డికి నిజామాబాద్ ఎంపీ అరవింద్ సవాల్

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో రాష్ట్ర సర్కార్ విఫలం అంటూ విమర్శలు

02

## పోచంపల్లి చేనేతకు కొత్త ఊపు

### ఈ చేనేత కళ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక



- ఇక్కత్ వస్త్రాలకు మరింత ప్రచారం
- చేనేత కళాకారులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు
- 'థ్రెడ్స్ పోచంపల్లి' చేనేత ప్రదర్శనను ప్రారంభించిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

02



- కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఊహించని స్కెచ్
- గ్రామాల్లో నిశ్శబ్దంగా పెరుగుతున్న కాషాయం
- తటస్థ ఓటర్లపై బీజేపీ గురి
- యువత, రైతులే కమలం టార్గెట్
- కాషాయ కోట దిశగా కమలం అడుగులు
- ఓటు బ్యాంక్ మార్పే బీజేపీ లక్ష్యం

## బీజేపీ

### గ్రౌండ్ లెవెల్‌లో బీజేపీ మాస్టర్ ప్లాన్

# సైలెంట్ ఆపరేషన్

## ఉత్తర తెలంగాణలో కాషాయ పార్టీ వ్యూహాత్మక విస్తరణ

### కుల సంఘాలతో సోషల్ ఇంజినీరింగ్

**ముద్ర, కరీంనగర్:**
తెలంగాణ రాజకీయాలు పైకి చూస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఆరోపణలు, ధర్నాలు, అరెస్టులు, సవాళ్లతో వేడెక్కుతున్నట్లు కనిపిస్తున్నా.. తెర వెనుక మాత్రం మరో రాజకీయ కథ నిశ్శబ్దంగా రూపుదిద్దుకుంటోంది. ఎలాంటి హడావుడి లేకుండా, పెద్ద ఎత్తున సభలు, సమావేశాలకు దూరంగా భారతీయ జనతా పార్టీ ఉత్తర తెలంగాణలో తన రాజకీయ పునాదులను బలోపేతం చేసుకునే దిశగా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు దుబ్బాక, హుజూరాబాద్ వంటి ప్రాంతాల్లో గతంలో సాధించిన విజయాలను మరింత విస్తరించేందుకు కాషాయ దళం హైపర్-లోకల్ వ్యూహాన్ని అమలు చేస్తోంది.

రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ స్థానిక స్థాయిలో ఆధిపత్య పోరులో నిమగ్నమై ఉండగా, ఆ పరిస్థితిని బీజేపీ తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు, కమిటీ నియామకాలు, స్థానిక వివాదాల నేపథ్యంలో రెండు పార్టీల కార్యకర్తల మధ్య పెరుగుతున్న విభేదాలు సాధారణ ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతున్నాయి. ఈ పరిస్థితిని అవకాశంగా మలుచుకుంటూ బీజేపీ తటస్థ ఓటర్లు, రాజకీయంగా ఇబ్బంది పడుతున్న వర్గాలను ఆకర్షించే పనిలో నిమగ్నమైంది.

**తటస్థ ఓటర్లపై గురి**
గ్రామాల్లో రాజకీయ విభేదాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో ఉంటే రాజకీయ రక్షణ లభిస్తుందనే భావనను బీజేపీ బలంగా తీసుకెళ్తోంది. 'స్థానికంగా ఎవరు గెలిచినా పాత కక్షలు తప్పవు.. కానీ కేంద్ర అధికార పార్టీతో ఉంటే భవిష్యత్‌కు భరోసా ఉంటుంది' అనే సందేశాన్ని గ్రామ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇప్పటివరకు ఏ పార్టీ వైపు మొగ్గు చూపని ఓటర్లు క్రమంగా బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారనే అంచనాలున్నాయి.

**కుల సంఘాలే ప్రధాన అస్త్రం**
ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో కుల సమీకరణాల ప్రభావం అత్యంత కీలకం. ఈ అంశాన్ని బీజేపీ వ్యూహకర్తలు పూర్తిగా అధ్యయనం చేసినట్లు తెలుస్తోంది. మున్నూరు కాపు, పద్మశాలి, యాదవ, గౌడ, ముదిరాజ్ వంటి బలమైన బీసీ వర్గాలతో పాటు దళిత, గిరిజన మిగతా 02లో

## సాగునీటి రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు

### ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసిన బీఆర్ఎస్ సాగునీటి రంగాన్ని నాశనం చేసింది
- పాలమూరు ప్రాంతంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం

02



## భూ నిర్వాసితుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటాం

### రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

- చట్ట ప్రకారం పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరం
- పుష్కరాలకు సకల సౌకర్యాలు

04



## 50 శాతం

# గ్రీన్ కవర్ లక్ష్యం

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: సీఎం చంద్రబాబు

**ముద్ర, విశాఖపట్నం:**
రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రోజురోజుకూ పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని.. ఓవైపు విపరీతమైన ఎండలు, లేదంటే తుఫానులు వస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం ముఖ్యమంత్రి పాల్గొన్నారు. శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు దీనికి హాజరయ్యారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏయూ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి మొక్క నాటారు. తిరుమల తరహాలో ఏయూ క్యాంపస్‌లోనూ గ్రీనరీ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం క్యాంపస్‌లో



25 శాతమే గ్రీనరీ ఉందని.. దీనిని 50 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలంటూ ఏయూ వీసీని సీఎం ఆదేశించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ.. 'స్వచ్ఛత, పచ్చదనం, పర్యావరణానికి ఏయూ క్యాంపస్ ఆదర్శంగా మారాలి. నెట్ జీరో క్యాంపస్‌గా ఏయూను నిలపాలి. ఆంధ్ర యూనివర్శిటీకి 450 ఎకరాల సువిశాల క్యాంపస్ ఉంది. ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెంచడంతో పాటు.. బిల్డింగుల మీద సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. క్యాంపస్‌కు

## తెలంగాణ జల హక్కులు కాపాడాలి

### మాజీ మంత్రి హరీశ్

- కృష్ణా జలాల్లో అన్యాయం..
- సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు బహిరంగ లేఖ
- కాళేశ్వరం, దేవాదుల నిర్వహణలో నిర్లక్ష్యం..
- రైతు డిస్కం ప్రతిపాదన ఉపసంహరించాలి..
- సాగునీటికి 24 గంటల విద్యుత్ ఇవ్వాలి
- ఏపీకి 74% కృష్ణా జలాలు.. తెలంగాణకు కేవలం 25% మాత్రమే

02



# పేదలకు ఇందిరమ్మ ఇండ్లు


### కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో నిర్మాణం

- ఆ స్థలాల్లో మహిళలకు వాటా కల్పిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

02



## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 06.06.2026
www.mudranews.in | @mudranews



## కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడే చిట్కాలు



కిడ్నీ వ్యాధిని "సైలెంట్ కిల్లర్" అని పిలుస్తారు, ఎందుకంటే ప్రారంభ దశలో దీని లక్షణాలు చాలా సాధారణంగా ఉంటాయి. శరీరం ఇచ్చే చిన్న చిన్న సంకేతాలను (ఉదాహరణకు: మూత్ర విసర్జనలో మార్పులు, అలసట, వాపులు) లైట్ తీసుకోకుండా వెంటనే అలర్ట్ అవ్వాలి.

# బీజేపీ సైలెంట్ ఆపరేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఉపకులాల ప్రభావశీల నేతలతో ప్రత్యేకంగా సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. గ్రామాల్లో ఐదు నుంచి పది కుటుంబాలను ప్రభావితం చేసే సామర్థ్యం ఉన్న వ్యక్తులను గుర్తించి వారితో సంబంధాలు పెంచుకుంటున్నారు. సామాజిక సమస్యలు, సంక్షేమ పథకాలు, స్థానిక అవసరాల పరిష్కారంలో తమ పాత్ర ఉంటుందని భరోసా కల్పిస్తూ కుల సంఘాల ద్వారా బీజేపీ తన సామాజిక విస్తరణను వేగవంతం చేస్తోంది. ఈ మైక్రో స్థాయి సోషల్ ఇంజనీరింగ్ భవిష్యత్తులో ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**యువత, రైతులపై ప్రత్యేక దృష్టి**

గ్రామీణ ప్రాంతాల్లో యువజన సంఘాలు, డిజిటల్ వేదికలను బీజేపీ సమర్థంగా వినియోగిస్తున్నట్లు కనిపిస్తోంది. వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా నెట్‌వర్క్‌ల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం నిర్వహిస్తోంది. అటు రైతు సంఘాలతో కూడా పార్టీ నాయకులు సన్నిహితంగా మమేకమవుతున్నారు. పంటల కొనుగోలు సమస్యలు, సాగునీటి ఇబ్బందులు, గ్రామీణ మౌలిక వసతుల లోపాలను స్థానిక ప్రభుత్వాల వైఫల్యాలుగా ప్రస్తావిస్తూ రైతుల్లో చర్చకు దారి తీస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లోని రచ్చబండలు, టీ దుకాణాలు, యువజన వేదికల వద్ద రాజకీయ చర్చల్లో బీజేపీ ప్రస్తావన పెరుగుతోందని స్థానికంగా చెప్పుకుంటున్నారు.

**2029 లక్ష్యంగా కాషాయ వ్యూహం**

బీజేపీ అమలు చేస్తున్న ఈ సైలెంట్ ఆపరేషన్ తక్షణ రాజకీయ లాభాల కోసం కాదని, దీర్ఘకాలిక రాజకీయ వ్యూహంలో భాగమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి ఉత్తర తెలంగాణను పార్టీకి బలమైన కోటగా మార్చడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ అధికార బలం, మరోవైపు బీఆర్ఎస్ సంప్రదాయ కేడర్ బలం మధ్య పోరు కొనసాగుతుండగా.. బీజేపీ మాత్రం ఓటు బ్యాంకు పునాదులను మార్చే దిశగా క్షేత్ర స్థాయిలో పనిచేస్తోంది. కుల సంఘాల మద్దతు, యువత ఆకర్షణ, తటస్థ ఓటర్ల విశ్వాసం కలిస్తే రాబోయే రోజుల్లో ఉత్తర తెలంగాణ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.



**పైకి నిశ్శబ్దం.. లోపల విస్తరణ**

ఉత్తర తెలంగాణలో ప్రస్తుతం కనిపిస్తున్న రాజకీయ నిశ్శబ్దం వెనుక బీజేపీ వ్యూహాత్మక కసరత్తు కొనసాగుతోందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలపడుతోంది. కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య ప్రత్యక్ష పోరు కొనసాగుతున్న వేళ, మూడో శక్తిగా కాకుండా ప్రత్యామ్నాయ ప్రధాన శక్తిగా ఎదగాలన్న లక్ష్యంతో కాషాయ దళం అడుగులు వేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పాలమూరు ప్రాజెక్టుల్లో వేల కోట్ల దోపిడీ!

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూరాల మినహా మిగిలిన ప్రధాన ప్రాజెక్టులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయని సీఎం అన్నారు. ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాస కార్యక్రమాలు కూడా సక్రమంగా నిర్వహించలేదని విమర్శించారు. భూసేకరణ పూర్తికాకుండా రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేయడం సాధ్యమే కాదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుల కోసం రూ.22 వేల కోట్లు కేటాయించామని, అందులో రూ.8వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లాకే ఇచ్చామని రేవంత్ తెలిపారు. మరో 4 వేల ఎకరాల భూసేకరణ పూర్తిచేసి, రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని తనపై వ్యక్తిగత కోపంతో కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని సీఎం ఆరోపించారు. పాలమూరు ప్రాంత అభివృద్ధిని రాజకీయ ప్రయోజనాల కోసం బలిచేశారని విమర్శించారు. గత ప్రభుత్వం అప్పుల భారం పెంచడంతో ప్రస్తుతం కొత్త రుణాలు తీసుకునే పరిస్థితి లేకుండా పోయిందని పేర్కొన్నారు.



బీఆర్ఎస్ నాయకుల విమర్శలను కూడా రేవంత్ తిప్పికొట్టారు. "బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలకు పైసా విలువ లేదు. కేసీఆర్ రద్దయిన వెయ్యి రూపాయల నోటు లాంటివారు" అంటూ ఘాటుగా స్పందించారు. ఆ పార్టీకి గతం మాత్రమే ఉందని, భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు.

ప్రాజెక్టుల నిర్మాణంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా సహకరించాలని బీఆర్ఎస్ నాయకులను కోరిన సీఎం, పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి పాలమూరు రైతుల కలలను సాకారం చేస్తామని హామీ ఇచ్చారు. కర్ణాటకతో సమన్వయం చేసుకుంటూ నీటి వనరుల వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల భవిష్యత్తుపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రానున్న రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో వేడిని రగిలించే అవకాశాలున్నాయి.

# తమిళనాట సరికొత్త రాజకీయం

**ముద్ర డెస్క్ :**

బీజేపీకి రాజీనామా చేసిన అనంతరం, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై శుక్రవారం (జూన్ 5) మధ్యాహ్నం 12 గంటలకు సోషల్ మీడియా ద్వారా ప్రజలతో సంభాషించి, కొత్త పార్టీ ఏర్పాటు చేస్తున్న ప్రకటించారు. తాను ఈ రోజు నుంచి కొత్త రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నానని, ఈ ప్రచారంలో తనకు మద్దతు ఇవ్వాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**'రజనీకాంత్ ఆహ్వానించారు'**

తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ, అన్నామలై తాను 2009లో డీఎండీకేలో ఇంటర్న్‌షిప్ చేసి, 2020లో బీజేపీలో చేరానని చెప్పారు. 2020 ఆగస్టు 24న బీజేపీలో చేరడానికి ముందు, నటుడు రజనీకాంత్ తనకు ఫోన్ చేసి, తాను ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీలో చేరమని ఆహ్వానించారని ఆయన వెల్లడించారు. అయితే, అప్పటికే బీజేపీ జాతీయ సంస్థ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌కు మాట ఇచ్చామన్నారు. అదే టైంలో రజనీకాంత్ పార్టీపై యూటర్న్ తీసుకున్నారని అందుకే తాను బీజేపీలో చేరానని చెప్పారు.

**కొత్త రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభిస్తారు**

క్షేత్రస్థాయి, స్వచ్ఛమైన, పారదర్శకమైన రాజకీయాలు ఉండాలనే తన లక్ష్యమని అన్నామలై పేర్కొన్నారు. తన కొత్త రాజకీయ ఉద్యమానికి ' ఉయ్ ది లీడర్' అని పేరు పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉద్యమ సభ్యులకు 'ఏపీజే అబ్దుల్ కలాం ఎథిక్స్ ఇన్ పాలిటిక్స్' అనే సంస్థ ద్వారా రాజకీయ, నైతిక నాయకత్వంలో శిక్షణ కూడా ఇస్తామన్నారు. తమ రాజకీయ పార్టీ ఏర్పడినప్పుడు, అందులో పదవీ పరిమితులను అమలు చేయడం ద్వారా వారసత్వ రాజకీయాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పట్ల తనకు ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందని అన్నామలై అన్నారు. అయితే, ఏ విషయంలోనైనా తనకు, బీజేపీకి మధ్య అభిప్రాయ భేదం ఉంటే, దానిని అత్యంత తీవ్రంగా, స్పష్టంగా చెబుతానని ఆయన అన్నారు. తాను బీజేపీలో ఉన్నప్పుడు కూడా త్రిభాషా విధానాన్ని వ్యతిరేకించానని ఆయన తెలిపారు.

తన రాజీనామా గురించి మాట్లాడుతూ, తాను కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశానని, పార్టీలో గమనించిన లోపాలను, తన అభిప్రాయాలను స్పష్టంగా వివరించానని అన్నామలై తెలిపారు. తాను ఆవేశంతో ఆలోచన లేకుండా రాజీనామా చేసే వ్యక్తిని కాదని, పార్టీ నాయకత్వానికి తన అభిప్రాయాలను తెలియజేసి గౌరవప్రదంగా వైదొలగాలని నిర్ణయించుకున్నానని అన్నామలై పేర్కొన్నారు.

అన్నాడీఎంకేతో పొత్తు లేకుండా సింగిల్‌గా గత ఎన్నికల్లో పోటీ చేయాలని బీజేపీ అధిష్ఠానానికి గట్టిగా చెప్పినట్టు అన్నామలై వెల్లడించారు. అయితే పార్టీ వేరే నిర్ణయం తీసుకున్నందున తాను అధ్యక్ష పదవిని వద్దనుకున్నట్టు పేర్కొన్నారు. ఇలా ఏడాదిన్నర నుంచి విభేదాలు ఉన్నట్టు ప్రకటించారు. అయితే వాటి కారణంగా తాను పార్టీకి రాజీనామా చేయలేదని వివరించారు. అభిప్రాయ భేదాలతో తాను బీజేపీకి భారం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

# పాలన చేత కాకపోతే తప్పుకోవాలి

**సీఎం రేవంత్ రెడ్డికి నిజామాబాద్ ఎంపీ సవాల్**

**ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో రాష్ట్ర సర్కార్ విఫలం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని ధర్మపురి అరవింద్ విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా తో మాట్లాడారు. వరి కోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అరవింద్ అన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్ర ప్రభుత్వంపై నెపం మోపడం సరికాదని వ్యాఖ్యానించారు. రైతుల ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామని చెప్పడం వారిని అవమానించడమేనని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించకుండా కేంద్రంపై విమర్శలు చేయడం తగదని ఆయన అన్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు, నిరుద్యోగ భృతి, గ్రామీణాభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## రాష్ట్రంలో 50 శాతం
# గ్రీన్ కవర్ లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలి. ఇప్పటికే రూ.5,18,000 విలువైన విద్యుత్ ఆదా అయింది. క్యాంపస్ ను బయోడైవర్సిటీ పార్కుగా తీర్చిదిద్దాలి. హాస్టళ్లు, కాలేజీల నుంచి వచ్చే చెత్త, చెట్ల ఆకులను కంపోస్ట్‌గా మార్చాలి. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, వ్యర్థాల నుంచి బయో గ్యాస్ ఉత్పత్తిపై దృష్టి పెట్టాలి. వేస్ట్ వాటర్ మేనేజ్మెంట్ చేపట్టాలి. క్యాంపస్ నుంచి ఒక్క చుక్క నీరు కూడా బయటకు వెళ్లకూడదు. శుద్ధి చేసిన నీటిని చెట్లకు ఉపయోగించాలి. పీఎన్జీ, ఎలక్ట్రికల్ స్టవ్స్ వంటలకు వినియోగించుకోవాలి. నెట్ జీరో విధానం అమలు చేయడానికి ప్రొఫెసర్స్ టీం ఏర్పాటు చేయాలి. పర్యావరణానికి సంబంధించి విద్యార్థులకు ఏయూ క్యాంపస్ ఓ నాలెడ్జ్ హబ్‌గా తయారవ్వాలి. ప్రపంచంలోని టాప్ నాలెడ్జ్ వర్సిటీల సరసన ఏయూను నిలపాలి. క్యాంపస్ లోపల ఎలక్ట్రికల్ సైకిళ్లను అందుబాటులోకి తీసుకురావాలి.' అన్నారు.

విశాఖలో కాలుష్య నియంత్రణ చర్యలు

విశాఖలో కాలుష్యాన్ని తగ్గించేందుకు పోర్టు దగ్గర నుంచి మొదలుకుని అన్ని ప్రాంతాల్లోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లంటూ సీఎం సరదాగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 2.5 కోట్ల సీడ్ బాల్స్‌తో గ్రీనరీ పెంచేలా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని చెప్పారు. విశాఖలో సైక్లింగ్, వాకింగ్ కోసం ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేస్తామన్నారు. సైక్లింగ్ ద్వారా రెండు విధాలుగా లాభం ఉందని.. కాలుష్యం తగ్గడమే కాకుండా ఫిట్‌నెస్ పెంచుకోవచ్చని సీఎం అన్నారు.

**సీఎం సైకిలింగ్..**

ఏయూ గ్రౌండ్స్ లో నిర్వహించిన మీడియా సమావేశం అనంతరం.. పర్యావరణ పరిరక్షణపై అందరిలో చైతన్యం తెచ్చేలా విశాఖలో సీఎం సైకిల్‌పై ప్రయాణించారు. ఎర్రటి ఎండ కాస్తున్నా.. సీఎం ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్ నుంచి 3 టౌన్ పీఎస్ జంక్షన్, పోలమాంబ గుడి, వుడా పార్క్, వైఎంసీఏ, బీచ్ రోడ్ మీదుగా నోవోటెల్‌కు సైకిల్‌పై వెళ్లారు. మొత్తం ఐదున్నర కిలోమీటర్ల దూరాన్ని 21 నిమిషాల్లోనే చేరుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు సైకిల్ ర్యాలీలో కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పోచంపల్లి చేనేతకు కొత్త ఊపు




**ముద్ర, యాదాద్రి భువనగిరి:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన పోచంపల్లి చేనేత కళకు మరింత ప్రాచుర్యం కల్పించే లక్ష్యంతో హైదరాబాద్‌లో "థ్రెడ్స్ పోచంపల్లి" చేనేత ప్రదర్శనను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయని, చేనేత కార్మికులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో చేనేత రంగ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించిందని తెలిపారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో వేలాది కుటుంబాలు చేనేతపై ఆధారపడి జీవిస్తున్నాయని చెప్పారు. పోచంపల్లి ఇక్కత్ చీరలు, పుట్టపాక టై అండ్ డై ఉత్పత్తులు అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య, రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దుడ్డం వెంకటరమణ, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్లు, చేనేత సంఘాల ప్రతినిధులు, కళాకారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సాగునీటి రంగంలో కాంగ్రెస్ నిర్ణయాత్మక చర్యలు

**ముద్ర, మహబూబ్‌నగర్ :**

తెలంగాణ సాగునీటి శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పాలమూరు ప్రాంతంలో రెండు రోజుల పాటు సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ రైతులకు ఆశించిన స్థాయిలో సాగునీటి ప్రయోజనాలు అందించలేకపోయిందని ఆరోపించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జూరాల నుంచి కాకుండా శ్రీశైలం నుంచి నీటి వనరును మార్చడం వల్ల ప్రాజెక్టు లక్ష్యాలు దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. రూ.27 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా కొత్త ఆయకట్టు సృష్టించలేదని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టిందని ఉత్తమ్ తెలిపారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు–రంగారెడ్డి, నారాయణపేట–కొడంగల్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతుల సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పారు. కృష్ణా జలాల వినియోగంలో కాంగ్రెస్ ప్రభుత్వం మెరుగైన ఫలితాలు సాధించిందని, తెలంగాణలో రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి, కొనుగోళ్లు జరిగాయని ఆయన పేర్కొన్నారు. రైతులకు పూర్తి మద్దతు అందిస్తూ, రాష్ట్రంలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణ జల హక్కులు కాపాడాలి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ జల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ 74 శాతం వినియోగిస్తుంటే.. తెలంగాణ 25 శాతానికి పరిమితమైందని లేఖలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చోటుచేసుకుందని తెలిపారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రమాదంలో పడేసిందని విమర్శించారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలు సాగునీటి రంగానికి ముప్పుగా మారాయని లేఖలో స్పష్టం చేశారు. అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని అన్నారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను సమర్థంగా కాపాడాలని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# వైసీపీ నేత బొల్లా అరెస్ట్

**ముద్ర, హైదరాబాద్ :**

హైదరాబాద్ గండిపేటలోని విలువైన ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని కాంచీపురంలో అదుపులోకి తీసుకున్న అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. గండిపేటలో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలు, తప్పుడు రెవెన్యూ రికార్డులతో కబ్జా చేసేందుకు కుట్ర పన్నినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. రూ. 12 కోట్లకు పైగా ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు దర్యాప్తులో తేలగా, ముందస్తు బెయిల్‌ను హైకోర్టు తిరస్కరించడంతో పరారీలో ఉన్న బ్రహ్మనాయుడును ప్రత్యేక బృందాలు పట్టుకున్నాయి. కేసుపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది.

# పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

**క్యూర్ పరిధిలో లక్ష గృహాల నిర్మాణం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**


పేదలు నివసిస్తున్న ప్రాంతాల సమీపంలోనే అల్పాదాయ, మధ్యతరగతి కుటుంబాల కోసం క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష, ఇతర ప్రాంతాల్లో 2.5 లక్షలతో కలిపి మొత్తం 3.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు వెల్లడించారు. మహిళల పేర్లపై ఇళ్ల యాజమాన్యం కల్పించి వారి ఆర్థిక, సామాజిక భద్రతను బలోపేతం చేస్తామని చెప్పారు. కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో సౌకర్యవంతమైన గృహాలను నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 06.06.2026
www.mudranews.in | @mudranews



### కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడే చిట్కాలు

కిడ్నీలు క్రమంగా పాడవుతూ చివరికి పూర్తిగా పనిచేయడం ఆగిపోయే స్థితిని క్రానిక్ కిడ్నీ డిసీజ్ (CKD) అంటారు. ఇది ముదరక ముందే రక్తంలో యూరియా, క్రియాటినిన్ వంటి వ్యర్థాల స్థాయిలను తెలుసుకోవడానికి క్రమం తప్పకుండా డాక్టర్ సలహా మేరకు పరీక్షలు చేయించుకోవాలి.



## ఆర్యవైశ్య మహాసభకు రూ.11 లక్షల విరాళం



**ముద్ర, వనపర్తి:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ భవనం, విద్యార్థి వసతి గృహ నిర్మాణానికి వనపర్తికి చెందిన ఆర్యవైశ్య సంఘం నేత, బంగారు వ్యాపారి రూ.11 లక్షలు విరాళాన్ని అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. తాను సంపాదించిన సంపాదనలో ఎంతో కొంత ప్రజల అభివృద్ధికి సంక్షేమానికి ఉపయోగపడాలన్న ఉద్దేశంతో వనపర్తి ఆర్సి జ్యువెలర్స్ యజమాని కలకొండ రమేష్ చంద్ర తన ఉదారతను చాటుకున్నారు. విద్య, సేవ, సామాజిక బాధ్యతల పట్ల అంకితభావంతో పని చేస్తూ, సమాజ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ఆయన, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ భవనం, ఆర్యవైశ్య విద్యార్థి వసతి గృహం నిర్మాణం కోసం విరాళంగా అందజేశారు. ఇటుకూరు వీరయ్య సమక్షంలో, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణకు విరాళాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా మహాసభ ప్రతినిధులు, సంఘ సభ్యులు కలకొండ రమేష్ చంద్ర సేవా తత్వాన్ని, విద్యా ప్రోత్సాహక దృక్పథాన్ని, సమాజ పట్ల ఉన్న నిబద్ధతను కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు.

## రెవెన్యూ, హౌసింగ్ సమస్యలు పరిష్కరించండి

**ముద్ర, కాప్రా:** ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన హౌసింగ్, రెవెన్యూ శాఖల పరిధిలో ఉన్న పలు అభివృద్ధి, ప్రజా సమస్యల అంశాలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని సచివాలయంలో శుక్రవారం కలిశారు.

ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు గృహ వసతి కల్పన, పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ సమస్యల పరిష్కారం, భూ సంబంధిత అంశాలు, రెవెన్యూ సమస్యలు, ప్రజల నుంచి వచ్చిన వినతులపై మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. వంద శాతం ప్రవేశాల లక్ష్యంతో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల (తెలుగు, ఇంగ్లీష్ మీడియం) ఆధ్వర్యంలో "బడిబాట – ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోయే విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధానోపాధ్యాయురాలు లత నాయకత్వంలో ఉపాధ్యాయ బృందం స్థానిక కాలనీల్లో విస్తృతంగా పర్యటించింది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలు కొనసాగుతున్నాయని కరపత్రాలు, బ్యానర్ల ద్వారా ప్రచారం నిర్వహించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు ప్రత్యేక అవగాహన కల్పించారు.

గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని ఉపాధ్యాయులు తెలిపారు. జె. దీక్షిత, హాజీరా ఫర్హీన్‌లు 549 మార్కులు సాధించి పాఠశాల టాపర్లుగా నిలవగా, పలువురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు నమోదు చేశారు. ఈ విజయాలను ప్రగతి నివేదిక ద్వారా ప్రజలకు వివరించి ప్రవేశాలపై అవగాహన కల్పించారు.

ఈ ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో ప్రధానోపాధ్యాయురాలు లతతో పాటు ఉపాధ్యాయులు అరుణదేవి, తిరుపతయ్య, భాగ్యలక్ష్మి , భీమమ్మ, సత్యనారాయణ, జహీర్, వెంకటయ్య, సలీం, సంగీత, సుదర్శన్, శ్రీనివాసులు, పుష్పలత, పాఠశాల సిబ్బంది, స్థానిక కౌన్సిలర్ నిజాం, విద్యార్థులు పాల్గొన్నారు.

### మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవనానికి

## రేపు సీఎం శంకుస్థాపన

**ముద్ర, మేడ్చల్ ప్రతినిధి:**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) శాశ్వత నూతన కార్యాలయ భవన నిర్మాణానికి ఈ నెల 7న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. ఉప్పల్ బాగాయత్‌లో నిర్మించనున్న ఈ కార్యాలయ భవనానికి ప్రభుత్వం సుమారు 10 ఎకరాల భూమిని కేటాయించడంతో పాటు రూ.98 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం తార్నాకాలోని తాత్కాలిక కార్యాలయం నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎంఎంసీకి ఈ భవనం శాశ్వత ప్రధాన కార్యాలయంగా మారనుంది. అలాగే కార్పొరేషన్ పరిధిలో రూ.1,474 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు కూడా సీఎం శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు.

కార్యక్రమ ఏర్పాట్లలో భాగంగా ఉప్పల్ బాగాయత్‌లోని ప్రతిపాదిత స్థలాన్ని కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. నూతన కార్యాలయం నిర్మాణంతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలన మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు సేవలు వేగవంతంగా అందుతాయని వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు మల్రెడ్డి రామిరెడ్డి, చల్లా నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

**- సీఎం రేవంత్ రెడ్డి**






**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వట్టెం పంప్‌హౌస్ మూడో లిఫ్ట్, నార్లాపూర్ రిజర్వాయర్ డెలివరీ సిస్టమ్, ఎంజీకేఎల్ఐ పంప్‌హౌస్ తదితర ప్రాజెక్టులను సందర్శించి పనుల స్థితిగతులను సమీక్షించారు. వట్టెం పంప్‌హౌస్‌లో 10 పంపుల్లో ఇప్పటికే 5 పంపులను ఏర్పాటు చేసి ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రాజెక్టుల పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్ సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రాజెక్టులు పూర్తయితే వ్యవసాయం, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

### సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం పలు కీలక ప్రాజెక్టులను పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం పంప్‌హౌస్ మూడో లిఫ్ట్, నార్లాపూర్ (అంజనగిరి) రిజర్వాయర్ డెలివరీ సిస్టమ్, ఎంజీకేఎల్ఐ పంప్‌హౌస్‌లను సందర్శించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

వట్టెం పంప్‌హౌస్‌లో 10 పంపుల్లో ఇప్పటికే 5 పంపులను అమర్చి ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. ప్రాజెక్టుపై ఇప్పటివరకు రూ.4,100 కోట్లు ఖర్చు కాగా, మిగిలిన సివిల్ పనులను మూడు నెలల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. నార్లాపూర్ రిజర్వాయర్ డెలివరీ సిస్టమ్ ద్వారా ప్యాకేజీలు–4, 5లకు నీటిని తరలించే విధానాన్ని అధికారులు వివరించగా, సాగునీటి సరఫరాలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను సీఎం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లును అమోదించాలి

**- ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. రజని**



**ముద్ర, కొండాపూర్:** భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) 72వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు జోశ్యభట్ల కల్పన పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. రజని మాట్లాడుతూ మహిళలపై సామాజిక, ఆర్థిక అసమానతలు, లింగవివక్షతకు వ్యతిరేకంగా సంస్థ 72 ఏళ్లుగా నిరంతర పోరాటం సాగిస్తోందని తెలిపారు. పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ అమలయ్యే వరకు దేశవ్యాప్తంగా ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. మహిళలకు చట్టపరమైన రక్షణ, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల కోసం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకులు కె. జ్యోత్స్న, వి. లలిత, మృణాలిని, టి. టాన్య, సీఆర్ ఫౌండేషన్ ట్రెజరర్ వి. చెన్నకేశవ రావు, ఉపాధ్యక్షులు కె. అజయ్, పాలిక్లినిక్ సిఓఓ కె. విజయ సంక్షేమ కేంద్రం టీచర్స్, విద్యార్థినులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు అందజేత

**ముద్ర, హైదరాబాద్:**

హైదరాబాద్ జిల్లాలోని వివిధ దిన పత్రికలు, చానల్స్ లలో పనిచేస్తున్నటు వంటి అర్హులైన జర్నలిస్టులందరికీ అర్హత మేరకు అక్రెడిటేషన్ కార్డులను అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అన్నారు. శుక్రవారం మొదటి విడత కార్డులకు సంబంధించి తన ఛాంబర్ లోని కమిటీ సభ్యులు అలాగే దినపత్రికలు చానల్స్ ల ప్రతినిధులకు అక్రిడేషన్ కార్డులను అందించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అలాగే దినపత్రికలు, చానల్స్ వారీగా డిపిఆర్ఓ కార్యాలయం నుండి మొదటి విడత మంజూరైన కార్డులను పొందాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సహాయ సంచాలకులు మహమ్మద్ హబీబ్, డి ఈ వెంకట్, కమిటీ సభ్యులు శంకర్ శిగ, నవీన్ కుమార్ యారా, మహమ్మద్ రఫియుద్దీన్ గౌరీ, కొమ్ము రాజు, మన్సూర్ అలీ , మోహనాచారి, దయానంద్, ప్రణీత, పత్రికల చానల్స్ ప్రతినిధులు సునీల్ కుమార్, మహమ్మద్ హమీద్ ఖాన్, గోపీనాథ్, రాజశేఖర్, మహేష్, మల్లేష్ బాబు, బాలకృష్ణ, ఉపేందర్, దయాకర్ కు మార్, మల్లేష్ తదితరులు పాల్గొ న్నారు.

## ఆస్పత్రి కాంపౌండర్ అనుమానాస్పద మృతి

**ముద్ర కూకట్పల్లి :** కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నంబర్ 1లోని ప్రీతి హాస్పిటల్‌లో కాంపౌండర్ గా విధులు నిర్వహిస్తున్న జువ్వి భీమసేన (35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సిర్గపూర్ మండలం కద్పాల్ గ్రామానికి చెందిన జువ్వి భీమసేన గత కొన్నేళ్లుగా కేపీహెచ్‌బీలోని ప్రీతి హాస్పిటల్‌లో పని చేస్తున్నాడు. అతను తన కుటుంబంతో కలిసి మదీనగూడలోని కృష్ణానగర్‌లో నివసిస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం రాత్రి విధులకు వచ్చిన భీమసేన, తెల్లవారుజామున ఆస్పత్రిలోని ఓ కుర్చీలో స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. మొదట అతను నిద్రపోతున్నాడని భావించిన సిబ్బంది, ఉదయం 6 గంటల ప్రాంతంలో ఎంత లేపినా లేవకపోవడంతో వెంటనే రెమిడీ ఆస్పత్రికి తరలించారు. అయితే, భీమసేన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

ఘటనపై ఆస్పత్రి సిబ్బంది సమాచారం ఇవ్వడంతో మృతుడి తండ్రి జువ్వి అంజయ్య కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హాస్పిటల్‌లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా, రాత్రి డ్యూటీలో ఉన్న భీమసేన స్వయంగా ఒక ఇంజెక్షన్‌ను శరీరంలోకి ఇంజెక్ట్ చేసుకున్నట్లు తేలింది. ఆర్థిక ఇబ్బందుల వల్లే తన కొడుకు ఇంజెక్షన్ తీసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## వంజరి కులస్తులకు ఎస్టీ హోదా పునరుద్ధరించాలి




**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణలో వంజరి కులస్తులకు గతంలో ఉన్న ఎస్టీ (షెడ్యూల్డ్ ట్రైబ్) హోదాను పునరుద్ధరించాలని, తాత్కాలిక ఉపశమనంగా డి.ఎన్.టి (డీనోటిఫైడ్ ట్రైబ్)గా గుర్తించాలని అఖిల భారత వంజరి సేవా సంఘం, తెలంగాణ వంజరి సేవా సంఘం డిమాండ్ చేశాయి. శుక్రవారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘ నాయకులు ఈ మేరకు ప్రభుత్వాన్ని కోరారు.

1978 వరకు ఎస్టీలుగా ఉన్న వంజరి కులస్తులను ఒక జీవో ద్వారా బీసీ–డి వర్గంలోకి మార్చడంతో దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన వంజరి కుటుంబాల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కులగణనలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. వంజరి కుల ఆరాధ్య సంత్ భగవాన్ బాబా పుణ్యతిథిని, ప్రముఖ నాయ కుడు గోపీనాథ్ ముండే జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉప్పల్‌లో నిర్మించిన వంజరి ఆత్మగౌరవ భవన అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేయాలని, ట్రస్టులో అన్ని నమోదిత వంజరి సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

సంఘంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సాల్వేరు కృష్ణ, ఎదుగని శంకర్ నారాయణ, ఎరుగని హరినాథ్, ధాత్రికా కాశీనాథ్, యుగంధర్, కాలేరు సురేష్, ఎదుగని వెంకటేష్, శివప్రసాద్, రత్నం సంతోష్, అముద లక్ష్మణ్, మహదేవ్ ముండే తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అధికారంలోకి రావడాన్ని ఎవరూ అడ్డుకోలేరు

**- ఎంపీ డీకే అరుణ**



**ముద్ర, నారాయణపేట:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాలి మోటా ర్లో తిరుగుతూ గాలి మాటలు చెబుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ కార్యకర్తలు పోరాటాలు, నిరసన దీక్షలకు సిద్ధం కావాలని పాలమూరు ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో రెండు రోజులపాటు నిర్వహించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశి క్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లా డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అంచనాలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించిన డీకే అరుణ, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలపై జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. పాల మూరు–రంగారెడ్డి ప్రాజెక్టు సహా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన ప్రాజె క్టులు బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనల్లోనూ పూర్తికాలేదని విమర్శించారు. రాష్ట్రంలో అమలవుతున్న అనేక సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వ నిధులే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రజల పన్నుల సొమ్ముతో అమలవుతోందని, ప్రభు త్వాన్ని ప్రజలు ప్రశ్నించాలని అన్నారు.


ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్య యాదవ్, రతంగ్ పాండు రెడ్డి, తిరు పతి రెడ్డి, లక్ష్మీ శ్యామ్ సుందర్, కొండయ్య, శ్రీనివాస్ లహోటి, బలరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ఏఆర్ కానిస్టేబుల్ మృతి

**ముద్ర ప్రతినిధి, నాగర్కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం ఉల్పారా గ్రామానికి చెందిన మద్దమల్ల రాజు 2014 బ్యాచ్ ఏ ఆర్ కానిస్టేబుల్ గా ఎంపికై నాగర్ కర్నూల్ ఆర్మ్డ్ రిజర్వులో విధులు నిర్వర్తిస్తున్నాడు. గత రెండు రోజులుగా సీఎం బందోబస్తు నిమిత్తం సోమశిలలో విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం సీఎం బందోబస్తు విధులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో వస్తుండగా మామిళ్ళపల్లి గ్రామం సమీపంలో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉప్పునుంతల పోలీసులు మృతదేహాన్ని అచ్చంపేట గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించారు. ఈ సంఘటనపై ఎస్పీ స్పందిస్తూ కానిస్టేబుల్ రాజు మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.


## కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడే చిట్కాలు

మన శరీరంలో కిడ్నీలు ఒక ముఖ్యమైన వడపోత యంత్రం లాంటివి. రక్తాన్ని శుభ్రంగా ఉంచడం, విష పదార్థాలను తొలగించడం కిడ్నీల బాధ్యత. కాబట్టి కిడ్నీలపై భారం పడకుండా ఉండాలంటే తగినంత నీరు తాగుతూ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలి. శరీరంలో నీరు, ఖనిజాల సమతుల్యతను కాపాడుకోవడం చాలా ముఖ్యం.



## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ దివ్యాంగులు తమ సొంత కాళ్ల మీద నిలబడేలా ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. దివ్యాంగుల కోసం రాష్ట్రంలో ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిందన్నారు. 11 వేల దివ్యాంగ పొదుపు సంఘాల్లో దాదాపు 80 వేల మంది దివ్యాంగులు లబ్ధిపొందుతున్నారన్నారు. దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీలో ఉన్న కఠిన నిబంధనలు సవరించామని, దీని ద్వారా ఎక్కువ మంది దివ్యాంగులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు దివ్యాంగుల ఆరోగ్యం మెరుగు కోసం బాల భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ దివ్యాంగుకు స్కూటీలు, అడ్వాన్స్డ్ చక్రాల కుర్చీలు, ల్యాప్ టాప్ లు, స్మార్ట్ ఫోన్లు, వినికిడి యంత్రాలు, తదితర పరికరాలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని అన్నారు. వీటి ద్వారా దివ్యాంగులకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ లు కలిసి 38 మంది దివ్యాంగ లబ్ధిదారులకు ప్రత్యేక స్కూటీలు అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ అధికారి వినూత్న, ఇతర అధికారులు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

## బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీకి ప్రశంస పత్రం



**ముద్ర: బోథ్:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా శుక్రవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జెడ్పీ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీకి ప్రశంస పత్రంను అందజేశారు. సొసైటీ ఆధ్వర్యంలో ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి, బోథ్ ప్రాంత పర్యాటక ప్రగతికి విశేష కృషి చేసినందుకు జిల్లా కలెక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారి, జిల్లా ఎస్పీ ల చేతుల మీదుగా సొసైటీ సభ్యులు ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు షేక్ అలీ మాట్లాడుతూ బోథ్ ప్రాంతంలో నెలకొన్న జీవ వైవిధ్యత, సహజ సిద్ధంగా ఏర్పడిన జలపాతాలను ప్రపంచం ముందు నిలిపి ఈ ప్రాంతంలో ఎకో టూరిజంను పెంపొందేలా తమ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ఈ పురస్కారం తమపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో బోథ్ ప్రాంతంలోని ప్రకృతి సంపదను కాపాడటంతో పాటు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, పర్యావరణ అవగాహన కార్యక్రమాలు, యువతలో ప్రకృతి పట్ల చైతన్యం కల్పించేందుకు మరిన్ని కార్యక్రమాలను చేపడతామని అన్నారు. ప్రకృతి పరిరక్షణ కోసం ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు వెండి పృథ్వీ, అబ్దుల్ రావుఫ్ తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ దినోత్సవం సందర్భంగా

## బట్ట సంచుల పంపిణీ



**ముద్ర, కోరుట్ల;** పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోరుట్ల వాసవీ వనితా క్లబ్, వాసవి సీనియర్ సిటిజెన్ అద్వర్యం లో పట్టణంలోని గడిబురుజు వద్ద గల కురగాయాల మార్కెట్ లో ప్లాస్టిక్ కవర్ వాడకం పై వినియోగదారులకు అవగాహన కల్పించారు. అనంతరం వారికి బట్ట సంచులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణం లో ప్రతి ఒక్కరు పాలొనాలని, మీ వీధి లో, ఆరుబయట మీ వంతుగా ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాసవి కబ్ ల అధ్యక్ష కార్యదర్శులు ఎలుగురి భాగ్యలక్ష్మి, చిటిమెల్లి గౌతమి, కొత్త గణేష్, శక్కరి వెంకటేశ్వర్లు, వేలుగురి మాధవి, ముక్క మౌనిక, బోడ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటాం

**చట్ట ప్రకారం పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది**
**ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరం**
**పుష్కరాలకు సకల సౌకర్యాలు కల్పిస్తాం**
**రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, ధర్మపురి:** ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్ర అభివృద్ధికి భూనిర్వాసితుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ముందుకు సాగుతామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మపురిలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్ర అభివృద్ధి, పుష్కర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ తో పాటు అధికారులు, భూనిర్వాసితులతో మంత్రి శుక్రవారం ధర్మపురిలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ నిర్వాసితుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ఎవ్వరిని ఇబ్బంది పెట్టకుండా శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర అభివృద్ధికి ముందుకు సాగుతామని తెలిపారు. 2017 –18 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు ప్రభుత్వం పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉందని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ప్రజా పాలనలో ప్రజలు ఎవ్వరిని ఇబ్బందులకు గురి చేయమని మంత్రి అన్నారు. ఇప్పటికే పలుమార్లు భూ నిర్వాసితులతో నెలలుగా చర్చలు జరిపామని శనివారం మరో దఫా చర్చలు నిర్వహిస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. ధర్మపురి క్షేత్ర అభివృది కోరకు స్థానికులంతా సహకరించాలని ఎవరు క్షేత్ర అభివృద్ధిలో రాజకీయాలు చేయద్దని మంత్రి ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలని అభివృద్ధి విషయంలో ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని మంత్రి కోరారు.దేశం నలుమూలల నుండి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఆలయ అభివృద్ధి కొరకు సేకరిస్తున్న భూములు, ఇల్లు కోల్పోతున్న వారు పెద్ద మనసుతో సహకరించాలని మంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. పుష్కరాలకు రూ.117కోట్లు..2027 జూన్ లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు మొదటి విడతగా ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, కోటి లింగాలకు రూ. 117 కోట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కేటాయించారని మంత్రి తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా బైపాస్ రోడ్లు, పార్కింగ్ స్థలాలు, పుష్కర ఘాట్లు నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. మరిన్ని సౌకర్యాల కోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నేడు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తున్నామని త్వరలోనే నిధులు సాధించి పుష్కరాలకు ముందే పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. సమీక్ష సమావేశంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మితో పాటు దేవాదాయ శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అందరి భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ

**కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** పర్యావరణ పరిరక్షణలో సమిష్టి భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" పర్యావరణ వారోత్సవాలు, అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ వేడుకలు మామడ మండలం ఆరేపల్లి గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. పర్యావరణ కాలుష్యం కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతిని వాతావరణ పరిస్థితుల్లో ప్రమాదకరమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. పుట్టినరోజు నాడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వివరించారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కూడా పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని తెలిపారు. రైతులు పంట వ్యర్థాలకు నిప్పు పెట్టవద్దని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడటమే కాకుండా ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు కారణం అవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయ మార్గాలను పాటించాలని తెలిపారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ఇంటి నుంచే ప్రారంభం అవ్వాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, సీనియర్ సివిల్ జడ్జి రవీందర్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఎఫ్డిఓ నాగిని బాను, ఇతర అధికారులు, గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



**ముద్ర, కోరుట్ల;** పర్యావరణ పరిరక్షణ మన కర్తవ్యం మొక్కలు నాటుదాం- భవిష్యత్తు తరాల కోసం అమ్మ పేరు మీద ఒక మొక్క నాటండి. భారత ప్రధానిగా నరేంద్ర మోదీ 12 సంవత్సరాల సుపరిపాలన అందించిన సందర్భంగా, భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు, కోరుట్ల పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కల్లూరు రోడ్డు లోని త్రిశక్తి ఆలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు, నియోజకవర్గ ఇన్చార్జ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనూప్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డె భూమన్న, రాష్ట్ర నాయకులు రుద్ర శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ప్రతి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడంసంతోషకరమని కొనియాడారు. ప్రతి ఒక్క కార్యకర్త ప్రధాని మోడీ పిలుపు మేరకు ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని దైవంగా భావించే గొప్ప సంస్కృతి మన భారతదేశానిది. పశ్చాత్తాపం లేని సంస్కృతికి భిన్నంగా, ప్రకృతిని పూజించే మన సాంస్కృతిక వారసత్వాన్ని అద్భుతంగా పునరుద్ధరిస్తోంది. ఈ సందర్భంగా జన్మనిచ్చిన తల్లిని, జీవనాధారమైన భూమాతను స్మరిస్తూ మొక్కలు నాటుదామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి చెట్లపల్లి సాగర్, ఎర్ర రాజేందర్, జిల్లా నాయకులు సుదవేని మహేష్, గిన్నెల శ్రీకాంత్, మేకల గణేష్, బిజెపి, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.మా కె నామ్ పే ఏక్ పేడ్నరేంద్ర మోడీ అధికారం చేపట్టి 12 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా "ప్రపంచ పర్యావరణ దినోత్సవం" లో భాగంగా "మా కె నామ్ పే ఏక్ పేడ్" కోరుట్ల మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఇందూరి తిరుమల వాసు పూల మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. ఈ అధిక ఉష్ణోగ్రత ఎల్నీనో ప్రభావానికి విరుగుడు మొక్కలు నాటడమేనని, రానున్న వర్షాకాలంలో ప్రజలు, యువకులు, విద్యార్థులు, నాయకులు అందరూ కూడా ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనాలని భారత దేశాన్ని పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

## కార్యకర్తలే బీజేపీ బలం

### ముధోల్ ఎంఎల్ఏ రామారావు పటేల్



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** బీజేపీకి అసలైన బలం నిబద్ధత గల కార్యకర్తలేనని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. నిర్మల్ లో శుక్రవారం నిర్వహించిన దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ కార్యక్రమ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ అధ్యక్షతన జరిగిన రెండు రోజుల శిక్షణ ముగింపులో ఆయన మాట్లాడారు. బీజేపీ పార్టీ స్థాపన, పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఏకాత్మ మానవతావాదం, సిద్ధాంతాలను కార్యకర్తలకు వివరించారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి నుండి నాయకులు
సమన్వయంతో కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ నిర్వహిస్తున్న ప్రతిక్షణం శిబిరాలను సద్వినియోగం చేసుకొని రాబోయే ఎన్నికల్లో విజయం సాధించేలా మెలకువలు నేర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఇంచార్జ్ గోపిడి స్రవంతి రెడ్డి, భైంసా మున్సిపాలిటీ చైర్మన్ తుమ్మోళ్ల దాత్తత్రి పటేల్, ఖానాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ అంకం మౌనిక మహేందర్, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, మేడిశెమ్మె రాజు, ఆకుల శ్రీనివాస్, చిన్నారెడ్డి, నల్లా రవీందర్ రెడ్డి, సత్యం చంద్ర కాంత్, ముత్యం రెడ్డి, మాదిరే శ్రీనివాస్, నల్లా రమేష్, పుస్పూర్ నర్సారెడ్డి, అర్జున్ ఠాకూర్, మండల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు, బీజేవైఎం నాయకులు, మండల ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకులు మెరుగైన సేవలు అందించాలి

### కలెక్టర్ భవేశ్ మిశ్రా




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.2025–26 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికానికి సంబంధించిన డీసిసి, డిఎల్ఆర్ సి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకుల సహకారం వల్ల ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని, దీనికోసం కావలసిన సహకారం బ్యాంకులు అందించాలన్నారు. పేద ప్రజల ఉన్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకులతో ముడిపడి ఉన్న ఎన్నో రకాల పథకాలు అమలు పరుస్తున్నాయన్నారు. ఇవి క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలందరికీ అందివ్వాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తత, పొదుపు, బ్యాంకింగ్ పై అవగాహన కలిగేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు, వీధి వ్యాపారస్తులకు, విద్యార్థులకు అందించు రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదన్నారు. వివిధ రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధిత రుణాలను అందజేయాలన్నారు.అనంతరం 2026 – 27 వార్షిక రుణ ప్రణాళిక నివేదికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఎస్బిఐ, టిజీబి రీజినల్ మేనేజర్లు రంజన్ కుమార్, నవీన్ కుమార్, ఆర్బిఐ లింక్డ్ బ్యాంకింగ్ ఆఫీసర్ రాములు, ఇతర అధికారులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 06.06.2026
www.mudranews.in | @mudranews



## కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడే చిట్కాలు



కొన్నిసార్లు కిడ్నీలు అకస్మాత్తుగా, వేగంగా పనిచేయడం ఆపేస్తాయి. దీనిని అక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్ అంటారు. ఇది తాత్కాలికమే అయినప్పటికీ, సరైన సమయంలో గుర్తిస్తే చికిత్సతో నయమవుతుంది. కాబట్టి అకస్మాత్తుగా శరీరంలో వచ్చే మార్పుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎండి గౌస్ పాషా




**ముద్ర, తుంగతుర్తి:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జడ్జి ఎండి.గౌస్ పాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలను పరిరక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయన్నారు. అందరూ తమ వంతు కృషిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్, న్యాయవాదులు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించి మొక్కలు నాటడంపై దృష్టి సారించాలని మణుగూరు, అశ్వాపురం రేంజ్ ఎస్ఆర్ఓ సత్తాజ్ అలీ, డీఆర్ఓలు కృష్ణ, ధనలక్ష్మి , వెంకట్రావు అన్నారు. శుక్రవారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం వేడుకల్లో భాగంగా ఐటీసీ అడ్మిన్ మేనేజర్ చెంగల్‌రావు, సర్పంచ్ కిశోర్‌నాయక్‌తో కలిసి సారపాక పుష్కరవనం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణ జరగడంతో పాటు మంచి ఆక్సిజన్ మానవాళికి అందుతుందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం అలవాటు చేసుకోవాలని అప్పుడే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలనే బాధ్యతను గుర్తు చేస్తుందంటూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం, మణుగూరు రేంజ్ బీట్ ఆఫీసర్లు బాబూరావు, ఎర్రయ్య, భీమ్చంద్, ఉపేందర్‌తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## వలిగొండ ఠాణాను తనిఖీ చేసిన ఎస్పీ




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** వార్షిక తనిఖీలో బాగంగా వలిగొండ పోలీస్ స్టేషన్ ను శుక్రవారం జిల్లా ఎస్పి అక్షాన్ యాదవ్ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ లోపల జనరల్ డైరీ పరిశీలించిన తర్వాత హెల్ప్ డెస్క్ విదులు అడిగి తెలుసుకున్నారు. సెక్షన్ ఇన్చార్జి వద్ద గల జనరల్ డైరీ ని తనిఖీ చేసి విధులను గురించి విచారించారు. కోర్టు రికార్డు గది తనిఖీ చేసి ఎవిడెన్స్ ప్రాపర్టీ నీ ఆర్డర్ లో పెట్టుకోవాలి అని ఆదేశించారు. ఈ పెట్టి ,పిటీషన్ పెండింగ్ ,రెజిస్టర్డ్ పిటిషన్ లను ఎప్పటికీఅప్పుడు సంబందిత రికార్డు లలో పొందుపరచాలని ఆదేశించారు రౌడీ షీటర్ ల రికార్డు లను పరిశీలించి వారి ప్రవర్తనల గురించి అడిగి తెలుసు కున్నారు. పోలీస్ స్టేషన్ బయట గల రికవరీ వాహనాల ను పరిశీలించి వాటికి సంబందించిన క్రైమ్ నెంబర్ ని వాటిపైన వేసి వాటి నేరాల నెంబర్ ఆధారంగా ఆర్డర్ లో పెట్టాలి అని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ జోన్ డిఎస్పి మధుసూదన్ , సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ,సబ్ ఇన్స్పెక్టర్ యుగేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలను అరికట్టాలి

### ఆర్డీఓకు వినతి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లా వ్యాప్తంగా వడ్ల కొనుగోలు ఐకెపి సెంటర్లలో పిఎసిఎస్ సెంటర్లలో జరుగుతున్న దోపిడి అక్రమాలను అరికట్టాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కాశపాక మహేష్, కార్యదర్శి రాసార నర్సింహా, మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ఫ్రంట్ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ గత మూడు రోజులుగా జిల్లాలోని మండలంలోని బస్వాపూర్, హుస్నాబాద్, బాలంపల్లి, రామచంద్రపురం, బొల్లెపల్లి, మరియు పలు గ్రామాల ఐకెపి సెంటర్లను సందర్శించడం జరిగిందని వర్షాకాలం ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్న జిల్లా వ్యాప్తంగా వడ్ల కొనుగోలు సెంటర్ల కల్లాలలో కుప్పలుగా వడ్లు పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రాసాల బాలస్వామి, జిల్లా కమిటీ సభ్యులు కూకుట్ల శ్రీశైలం, ఏనుగు మల్లారెడ్డి, చిక్కుల కరుణాకర్ పాల్గొన్నారు.

## దేశ సంస్కృతీ సంప్రదాయాలను

# విశ్వవ్యాప్తం చేసిన ఘనత చేనేత రంగానిదే

**థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన రాష్ట్ర వ్యవసాయ, చేనేత-జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**నేటి నుంచి మూడు రోజుల పాటు కొనసాగనున్న చేనేత ప్రదర్శన**

**పోచంపల్లి చేనేత కళకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యం**







**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "తెలంగాణ రైసింగ్ " కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన " థ్రెడ్ పోచంపల్లి" (థ్రెడ్ పోచంపల్లి) చేనేత వస్త్ర ప్రదర్శనను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పోచంపల్లి ఇక్కత్ చేనేత కళకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడి నేతన్నల నైపుణ్యం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన చేనేత సంప్రదాయాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు లభించిన జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ ఇక్కడి కళాకారుల సృజనాత్మకతకు, నైపుణ్యానికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపని మంత్రి తెలిపారు. భూదాన్ ఉద్యమానికి చారిత్రక కేంద్రంగా నిలిచిన పోచంపల్లికి ప్రత్యేక స్థానం ఉందని, పోచంపల్లి రుమాళ్లు, ఇక్కత్ చీరలకు ప్రపంచ మార్కెట్‌లో మరింత ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.చేనేత రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండున్నర సంవత్సరాల్లో చేనేత రంగం అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం సుమారు రూ.1,400 కోట్లకు పైగా ఖర్చు చేశామని తెలిపారు. నేతన్నల ఉపాధికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.గ్లోబలైజేషన్ పోటీని ఎదుర్కొనేందుకు రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ సంస్థ ద్వారా చేనేత కుటుంబాల పిల్లలకు ఆధునిక డిజైన్లు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందించి అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. డూప్లికేట్ ఉత్పత్తుల వల్ల చేనేత బ్రాండ్‌కు కలిగే నష్టాన్ని నివారించడంలో కూడా ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఈ ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనకు మరింత మంది ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చర్యలు తీసుకుని చేనేత కళాకారులకు ప్రోత్సాహం అందించాలని అధికారులను ఆదేశించారు. నల్గొండ జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు, పెద్ద సంఖ్యలో కళాకారులు పాల్గొన్నారు.

# సూర్యాపేట కు ఉత్తమ మున్సిపాలిటీ ' పురస్కారం

**మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా అవార్డు అందుకున్న చైర్‌పర్సన్ , కమిషనర్**




**ముద్ర ప్రతినిధి, సూర్యాపేట:** వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో విశేష కృషి చేస్తున్న సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ప్రదానం చేసే ఉత్తమ పర్యావరణ పనితీరు పురస్కారం'కు సూర్యాపేట మున్సిపాలిటీ ఎంపికైంది. ఈ పురస్కారాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని టీజీపీసీబీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో దేవాదాయ, అటవీ శాఖ మరియు ఎన్విరాన్ మెంట్ మంత్రివర్యులు కొండా సురేఖ చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి అందుకున్నారు.పట్టణంలో వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల పునర్వినియోగం, పారిశుధ్య కార్యక్రమాల అమలు, పర్యావరణ పరిరక్షణ చర్యల్లో సూర్యాపేట మున్సిపాలిటీ కనబరిచిన ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని రీసైక్లింగ్ చేయడం, పర్యావరణ హిత కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా అమలు చేయడం మున్సిపాలిటీకి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మీ మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీకి లభించిన ఈ పురస్కారం పట్టణ ప్రజలు, పారిశుధ్య కార్మికులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషికి నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో కూడా పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి సూర్యాపేటను రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణలో సూర్యాపేట అమలు చేస్తున్న వినూత్న విధానాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు చర్యలు కొనసాగిస్తామని చెప్పారు.ఈ అవార్డుతో మున్సిపాలిటీ రాష్ట్రంలో పర్యావరణహిత పట్టణాల జాబితాలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. ఆయన అన్నారు..

# అకాల వర్షం.. ఆగమాగం



**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాన**

**జనగామలో ఈదురు గాలులకు విరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు**

**పలు మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం**

**ముద్ర, వరంగల్:**ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా గురువారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. మధ్యాహ్నం వాతావరణం చల్లబడి కురిసిన వాన రైతులను ఆగమాగం చేసింది. జనగామ, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం పడగా, మిగతా చోట్ల తేలికపాటి వాన కురిసింది. జనగామ జిల్లాలో ఈదురు గాలులతో వర్షం కురవగా, జనగామ వ్యవసాయ మార్కెట్, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పాంనూర్, రంగరాయగూడెం, నర్మెట మండలం వెల్దండ, హన్మంతాపూర్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కాంటాలైన ధాన్యం బస్తాలు తడిసిపోగా, కుప్పలు పోసిన వడ్లు కొట్టుకుపోయాయి. అలాగే పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపోయాయి. జనగామ మండలం శామీర్‌పేట, కమలాపూర్ మండలం ఉప్పులపల్లిలో పిడుగుపాటుకు గేదె, ఆవు మృతి చెందాయి. కాగా జనగామ వ్యవసాయ మార్కెట్ సహా కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం బేషరతుగా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసి తరలింపునకు నోచుకోకుండా తడిసిన ధాన్యం బస్తాలను కొర్రీలు లేకుండా మిల్లుల్లో దిగుమతి చేసుకోవాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# రైతు కంట కన్నీరు




**ముద్ర, తుంగతుర్తి:** ఆరుగాలం కష్టించి పండించిన పంట గత కొన్ని వారాలుగా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు సెంటర్ తుంగతుర్తి రైతు సేవ సహకార సంఘంలో పోయగా అధికారుల అలక్షమో కొనుగోలు సంఘం వారి నిర్లక్షమో తెలియదు కానీ శుక్రవారం నాడు కురిసిన భారీ వర్షానికి యావత్ ధాన్యం మొత్తం తడిసి ముద్దయింది. దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. రైతు సేవ సహకార సంఘంలో తాము ధాన్యం పోసి వారాలు గడుస్తున్నాయని ఇంకా కాంటాలు కాని ధాన్యం ఉందని కాంటాలై బస్తాలు నింపిన ధాన్యం లారీలు రాక కొనుగోలు సెంటర్ లోనే ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .జిల్లా కలెక్టర్ ఈనెల 4వ తేదీ వరకే ధాన్యం కొనుగోలు పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారని అయిన ప ్పటికీ అ ధికారుల ఆ ల క్ష్యం సంఘం వారు నిర్లక్ష్యం మూలంగా తాము శిక్షకు గురయ్యామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోహిణి కార్తి రావడం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడం వర్షాలు వస్తాయి అని తెలిసిన నిమ్మగు నీరెత్తినట్టున్న అధికారులు ధాన్యం బస్తాలను తరలించడంలో నిర్లక్ష్యం చూపడంతోనే ధాన్యం తడిసి ముద్దయిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదేమని ఎవరిని అడగాలో తమకు అర్థం కావడం లేదని రైతులంటున్నారు. గత రెండు నెలలుగా వేసవి ఎండలకు రాసులుగా పోసిన ధాన్యం ఎండి ఎండి ఉన్నదని త్వర త్వరగా ధాన్యాన్ని కాంటాలు పెట్టి తరలించాల్సిన బాధ్యులు నిర్లక్ష్యం వహించడం మూలంగానే ఖరీఫ్ సీజన్ వచ్చి వర్షాలు ప్రారంభమయ్యాయి రైతులు అంటున్నారు .తాము ఇంకా కళ్ళల్లోనే ధాన్యం కాపులా ఉంటే మరి ఖరీఫ్ సీజన్లో వరి నారులు ఎలా పోసుకోవాలి అని ప్రశ్నిస్తున్నారు .తడిసిన ధాన్యాన్ని తిరిగి ఎలా ఆరబెట్టాలని ఇది వేసవికాలం కాదని ఖరీఫ్ సీజన్ రావడంతో వర్షాలు ఎప్పుడు కురుస్తాయో తెలియదని తమకు ఏం చేయాలో పాలు పోవడం లేదని రైతులు తీవ్ర ఆవేదన గురవుతున్నారు. కాంటాలు గాని ధాన్యం రాశులుగా ఉందని అవి కూడా తడిసి ముద్దయ్యాయని మరి ఇకనైనా అధికారులు ఒకటి రెండు రోజులలో ధాన్యం కొనుగోలు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని తూకాలు అయిన ధాన్యం బస్తాలు తరలింపులో జాప్యం చేసిన విషయంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని యావత్ రైతాంగం కోరుతోంది. ఇకనైనా అధికారులు మిగిలి ఉన్న ధాన్యం రాశులను త్వర త్వరగా తూకాలు వేసి లారీలను పంపి ధాన్యం తరలించాలని రైతుల కోరుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 06.06.2026
www.mudranews.in | @mudranews



## కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడే చిట్కాలు

ఒకవేళ కిడ్నీ సమస్య తీవ్రమై 'ఎండ్-స్టేజ్ కిడ్నీ డిసీజ్' కి దారితీసినా అధైర్య పడకూడదు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం కాబట్టి, వైద్యుల పర్యవేక్షణలో సరైన సమయంలో డయాలసిస్ లేదా కిడ్నీ మార్పిడి వంటి చికిత్సలను తీసుకోవడం ద్వారా రోగులు ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించవచ్చు.



## మొక్కలు నాటిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లా కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు వాటి వాటిని రక్షించి, మానవ మనుగడకు దోహదపడాలన్నారు. మొదటి అడిషనల్ జడ్జి సుభవల్లి, సీనియర్ సివిల్ జడ్జి సంతోష్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సాయి ప్రభాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, ట్రెజరర్ నర్సింలు, ఫోక్సో కోర్టు పిపి బాలయ్య, సీనియర్ న్యాయవాదులు రవీందర్, పోచయ్య, సంతోష్ రెడ్డి, వినోద్ శ్రీవత్సవ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణానికి రైల్వే బోర్డు 'నో'

**ఉచిత ప్రయాణ ప్రతిపాదనను తిరస్కరించిన బోర్డు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్ నగర ప్రజలకు ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణాన్ని తీసుకురావాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనకు రైల్వే బోర్డు నుంచి చుక్కెదురైంది. జూన్ 2 నుంచి ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను రైల్వే బోర్డు శుక్రవారం తిరస్కరించింది. ఇప్పటికే తాము భారీ నష్టాల్లో నడుస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో ఉచిత ప్రయాణాలు సాధ్యం కాదని స్పష్టం చేస్తూ ప్రభుత్వానికి లేఖ రాసింది. రైల్వే అధికారులు పంపినఎంఎంటీఎస్ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని లెక్కలతో సహా వివరించారు. సర్వీసుల నిర్వహణ వల్ల కేవలం ఒక్క ఏడాదిలోనే దాదాపు రూ.160 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంఎంటీఎస్ ప్రాజెక్టులకు సంబంధించి తమకు చెల్లించాల్సిన రూ.490 కోట్ల పాత బకాయిలను కూడా ఇంకా చెల్లించలేదని రైల్వే బోర్డు లేఖలో పేర్కొన్నారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణ పథకాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని భావిస్తే.. దానికి సంబంధించిన పూర్తి ఆర్థిక భారాన్ని మోసేందుకు సిద్ధంగా ఉండాలని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఎంఎంటీఎస్ వ్యవస్థకు వచ్చే నష్టాల మొత్తాన్ని 100 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే.. ఆ ప్రతిపాదనకు తాము అంగీకరిస్తామని రైల్వే అధికారులు తేల్చిచెప్పారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వేటే

**హైదరాబాద్ సీపీ సజ్జనార్**
**హైదరాబాద్ పరిధిలో ఆపరేషన్ కవచ్ పేరిట వాహన తనిఖీలు**
**2,149 వాహనాలు సీజ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చీటింగ్, ఫోర్జరీ కేసులు నమోదు చేస్తామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా గురువారం రాత్రి హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో 'ఆపరేషన్ కవచ్' పేరిట ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు సజ్జనార్ శుక్రవారం ఎక్స్ వేదికగా వివరాలు తెలిపారు. జూబ్లీహిల్స్–వెంకటగిరి, మధురానగర్–కృష్ణకాంత్ పార్క్, బోరబండ–పిలీ దర్గా, సనత్‌నగర్, అమీర్‌పేట్–సత్యం థియేటర్, తదితర ప్రాంతాల్లో స్వయంగా తానే క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా కమిషనరేట్ వ్యాప్తంగా మేము మొత్తం 12,098 వాహనాలను (8,802 ద్విచక్ర వాహనాలు, 1,693 ఫోర్ వీలర్స్, 1,623 ఆటోలు) తనిఖీ చేశామన్నారు. ఇందులో సరిగ్గా లేని నంబర్ ప్లేట్లు గల 1,406 వాహనాలను, అసలు నంబర్ ప్లేట్ లేని 1,132 వాహనాలను, నకిలీ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న 69 వాహనాలను గుర్తించినట్లు చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన మొత్తం 2,149 వాహనాలను (2,046 ద్విచక్ర వాహనాలు, 52 ఫోర్ వీలర్స్, 51 ఆటోలు) స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నెంబర్ ప్లేట్ల ట్యాంపరింగ్, నకిలీ లేదా అసలు నెంబర్ ప్లేట్లు లేకపోవడాన్ని కేవలం సాధారణ ట్రాఫిక్ ఉల్లంఘనగా పరిగణించబోమని స్పష్టం చేశారు. ఇది సమాజ భద్రతకు పెను ముప్పుగా మారడంతో పాటు, అమాయకులను ఇబ్బందుల్లోకి నెడుతోందన్నారు.రాబోయే రోజుల్లో అన్ని రకాల వాహనాలపై తనిఖీలు కొనసాగుతాయన్న కమిషనర్.. వాహనదారులు ఎల్లప్పుడూ సరైన పత్రాలను తమతో ఉంచుకోవాలని సూచించారు. నగర శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలంతా పోలీసులకు సహకరించాలని కోరారు.

## సింగరేణిలో కుంభకోణంపై విచారణ జరపండి

**సింగరేణి నిల్వల నుంచి సీఎం రేవంత్ రెడ్డి 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారు**
**స్టాక్ యార్డుల్లో ఉండాల్సిన బొగ్గును అమ్ముకున్నారు**
**కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లేఖ**

ముద్ర, తెలంగాణ బ్యూరో : సింగరేణి సంస్థలో రూ.1600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు కుంభకోణం జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో వరుస అవినీతి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి వివిధ గనుల వద్ద సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు రికార్డులు చూపిస్తున్నప్పటికీ, స్టాక్ యార్డుల్లో ఆ బొగ్గు కనిపించకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆస్తిగా భావించే సింగరేణి బొగ్గును పక్కదారి పట్టించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో స్పందించి వాస్తవాలను వెలికితీయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. విచారణ జరపకపోతే కార్మికులతో కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కేంద్రం కూడా ఈ అంశంపై సమాధానం చెప్పాలని ఆయన కోరారు.

## భారత జీడీపీ వృద్ధి 7.7 శాతం

భారత్ 2025–2026 ఆర్థిక సంవత్సరానికి 7.7 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.1 శాతంగా ఉంది. జనవరి–మార్చి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు చేసింది. ఈ మేరకు స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖ గణాంకాలను శుక్రవారం వెల్లడించింది. 2025–26 సంవత్సరంలో రూ.323.12 లక్షల కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. ప్రస్తుత ధరల వద్ద జీడీపీ 2024–25లో రూ. 318.07 లక్షల కోట్లు ఉండగా.. 2025–26లో అది రూ.346.36 లక్షల కోట్లకు చేరుకున్నట్లు పేర్కొంది.

# గ్రామీణ అభివృద్ధి శాఖ లక్ష్యాలను సాధించాలి

**కలెక్టర్ ప్రతిమా సింగ్**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** గ్రామీణ అభివృద్ధి శాఖ 2026–27 సంవత్సరానికి లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.శుక్రవారం కలెక్టరేట్లో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో సమీక్షించారు.గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నూతన మహిళ సంఘాల నమోదు, శ్రీనిధి లోన్స్, ధాన్యం కొనుగోళ్లు, ఇందిరా మహిళా చీరల పంపిణీ, గోదాములు, వ్యవసాయ ఉత్పత్తులు, సోలార్ పంపు సెట్లు, పెట్రోల్ బంకులు, చేయూత పింఛన్లలో లక్ష్యాలు సాధించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు, అడిషనల్ గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

**పక్కగా జనగణన జరగాలి**

నార్సింగి మండల కేంద్రంలోన జన గణనను పరిశీలించారు. జన గణన పక్కగా చేయాలన్నారు. జన గణనలో ప్రజల యొక్క సమాచారం పక్కగా నమోదు చేసి ఆన్లైన్ ఆప్ లో నమోదు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు జరగాలని, ధాన్యం పూర్తి అయిన కేంద్రాల్లోని సిబ్బంది, వాహనాలు , వస్తు సామాగ్రిని, హమాలీలను ధాన్యం నిలువ ఉన్న కేంద్రాల్లో పని చేయించాలన్నారు. మిల్లులో త్వరగా ధాన్యం అన్లోడింగ్ జరగాలని అధికారులను ఆదేశించారు.

**ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి**

కలెక్టరేట్లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం తగ్గించడంపై ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ స్టాల్స్ ను సందర్శించారు. కాలుష్య నియంత్రణకు అవసరమైన ప్రత్యామ్నాయాలపై (జూట్ / క్లాత్ బ్యాగులు, జీవ వ్యర్థాల నిర్వహణ) స్టాళ్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో భాగస్వాములై పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు.

అంతకుముందు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో మెదక్ కొత్త బస్ స్టాండ్ వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లకు ప్రత్యామ్నాయాలపై ప్రదర్శన అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిపిఆర్ఓ రామచంద్ర రాజు ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ కుమార్ పాఠక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

**222 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేత**

జిల్లా వ్యాప్తంగా 76,276 మంది రైతుల నుంచి 3,58,118 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. 60,349 మంది రైతుల బ్యాంకు ఖాతాలో 644,98 కోట్ల రూపాయలు చెల్లింపులు చేసినట్లు పేర్కొన్నారు. 222 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేశామన్నారు..

# మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారం

- మొక్కలు నాటాలని ప్రతిజ్ఞ
- మెదక్ ఫారెస్ట్ ను టూరిస్ట్ హబ్ గా రూపొందించాలి
- కలెక్టర్ ప్రతిమా సింగ్







**ముద్ర ప్రతినిధి, మెదక్:** మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారం... ప్రతి భారతీయుడు తమ తల్లి, భూమాత గౌరవార్థం ఒక మొక్కను నాటాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామం వన్ యోజన అటవీ పార్కు వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ నుండి రత్నాకర్, డిఎఫ్ఓ జోజి, డిఆర్డిఓ శ్రీనివాసరావులతో కలిసి మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటి సంరక్షించి భవిష్యత్తులో వృక్షాలుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో 24% అటవీ సంపద ఉంది, జిల్లాలో నర్సాపూర్, వడియారం, పరికిబండ, మనోరాబాద్ అర్బన్ ఫారెస్ట్ పార్కులను హైలెట్ చేయడం జరుగుతుందన్నారు. ఫారెస్ట్ కు పిల్లలకు ప్రత్యేక టూర్ అరేంజ్ చేసి వారందరికీ జిల్లాలో అటవీ సంపద, ఫారెస్ట్ పార్కులు, మొక్కల వల్ల భావి తరాలకు ఉపయోగం సంబంధిత విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రత్నాకర్ మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు చెట్లే ప్రతిరూపంగా ఉంటాయన్నారు. విశాఖపట్నంలో సునామీ ఏర్పడినప్పుడు చెట్లు ఉన్న ప్రాం తాలలో దాని యొక్క తాకిడి చాలా తక్కువ మొత్తంలో ఉన్నదన్నారు. ఆర్ అండ్ బి ఈఈ వేణు, సంబంధిత ఎఫ్ఆర్ఓ, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, సభ్యులు యాదగిరి, డిజి శ్రీనివాస్ శర్మ, సర్పంచ్ యాదగిరి, ఉపసర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

## మెదక్‌లో మొక్కలు నాటిన ఎంపీ రఘునందన్ రావు



**ముద్ర ప్రతినిధి, మెదక్:**అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా కార్యాలయం ఆవరణలో పార్లమెంట్ సభ్యులు ఎం.రఘునందన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొనితల్లి పేరు మీద ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఎంపీ మాట్లాడుతూ... ప్రతి బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు తప్పనిసరిగా 'ఏక్ పెడ్ మాకే నామ్ పే'లో భాగంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యత కోసం త్వరలోనే మెదక్ – ఎల్కతుర్తి జాతీయ రహదారికి ఇరువైపులా భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఈర్ల రజిత్ రెడ్డి, సంఘసాని సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ గౌడ్, కార్యదర్శి కల్కి నాగరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, పబ్బా సత్యనారాయణ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎల్.ఎన్. రెడ్డి, పట్టణాధ్యక్షులు నాయిని ప్రసాద్, సర్పంచ్ బెండవీణ, కౌన్సిలర్ అఖిల భరత్, మండల అధ్యక్షులు సంతోష్ చారి, శ్రీనివాస్, హరీష్ తదితర సీనియర్ నాయకులు, జిల్లా శాఖ పదాధికారులు పాల్గొన్నారు.

## మంజీరా నదిలో స్నానానికి దిగి ముగ్గురి మృతి

**ముద్ర,బాన్సువాడ :** కామారెడ్డి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగిన నలుగురు ప్రమాదవశా త్తు నీట మునిగి గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టగా.. ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. పిట్లం మండలం మంగల్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన భానుప్రసాద్, అనిత (40), పావని (14), శివాని (13) నదిలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో నదిలో నలుగురూ గల్లంతయ్యారు. స్థానికులు గాలింపు చేపట్టి భానుప్రసాద్‌ను రక్షించారు. మిగిలిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి.

## స్పా సెంటర్లపై పోలీసుల మెగా దాడులు

మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న స్పా సెంటర్లపై పోలీసులు శుక్రవారం భారీ స్థాయిలో దాడులు నిర్వహించారు. సుమారు 500 మంది పోలీసులు బృందాలుగా ఏర్పడి 113 స్పా సెంటర్లను తనిఖీ చేశారు. పలు కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘనలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించారు. కస్టమర్ల వివరాల రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు, కొన్ని స్పా సెంటర్లలో జరుగుతున్న అక్రమాలపై భవన యజమానులు కూడా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అధికారులు, స్పా సెంటర్ల నిర్వహణపై మరింత కఠిన నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# వైద్యుల బదిలీలు పారదర్శకంగా జరపాలి

**– తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ చందర్**
**- ఓపి సేవలు నిలిపివేసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన వైద్యులు**



**ముద్ర ప్రతినిధి,సిద్దిపేట:** ప్రభుత్వ వైద్యుల బదిలీలలో జీవో నెంబర్ 38ను పారదర్శకంగా అమలు జరపకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ చందర్ తెలిపారు. ప్రభుత్వ వైద్యుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు శుక్రవారం ఓపీ సేవలు నిలిపివేసి ఆసుపత్రి ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చందర్ మాట్లాడుతూ..ప్రభుత్వ వైద్యుల బదిలీల్లో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడం వల్ల తమకు సరైన ఆప్షన్స్ ఇవ్వడం లేదని వాపోయారు. బదిలీలకు కటాఫ్ డేట్ నిర్వహించి ఆన్‌లైన్‌లో ఆప్షన్స్ ఇవ్వకపోవడమేంటని ప్రశ్నించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడుదామని వెళితే వారు అందుబాటులో ఉండడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవో ప్రకారం బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. లేని పక్షంలో ఓపీ సేవలతో పాటు అత్యవసర సేవలు కూడా నిలిపివేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ వినోద్‌బాబ్జి, డాక్టర్ టి.సి.మనోహర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హేమరాజ్‌సింగ్, డాక్టర్ సదానందం, డాక్టర్ వేణు గోపాల్‌చారి, డాక్టర్ శృతి, తదితరులు పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413 . email: mudradaily@gmail.com